



బ్రహ్మసముద్రంలో మౌనదీక్షలో పాల్గొన్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు, తదితరులు

అదునులో లేని పదును



మొక్కజొన్న, వేరుశనగ పంటలు ఎండుముఖం
వర్షాభావంతో ఎండుతున్న 12 వేల ఎకరాలు...
అయోమయంలో రైతులు
పెట్టుబడి కూడా తిరిగిరాని పరిస్థితి

ఈ ఏడాది ఆశించిన దానికంటే అధికంగా వర్షాలు కురిసాయి. వర్షాలు బాగా పడ్డాయి, పంటలకు ఈసారి ధోకా లేదనుకుంటే పొరపాటే. పంట కీలకమైన దశలో వర్షం కురవక పోవటంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పంటలు ఎండు ముఖం పట్టాయి. దీంతో లక్షలాది రూపాయలు అప్పు చేసి పంట సాగు చేసిన రైతు పరిస్థితి అయోమయంగా మారింది. సీజన్ మొత్తానికి వర్షపాతం నమోదయినా నెలల వారిగా తీసుకుంటే ఆయా నెలల్లో వర్షపాతం తక్కువగా నమోదయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే సీజన్ మొత్తానికి తలుపుల మండలంలో సాధారణం కంటే 32.7 మిల్లీమీటర్ల తక్కువ వర్షపాతం నమోదయింది. భారీ వర్షాలకు, వరదలకు రాష్ట్రంలో పలు జిల్లాల్లో పంటలు నీటమునిగి, ఊళ్లకు ఊళ్లు జలమయమయ్యాయి. వరద ధాటికి రాష్ట్రకేంద్రంలో ఇప్పటికీ పరిస్థితి దయనీయంగా ఉంది. అయితే ఉమ్మడి అనంతపురంలో జిల్లాలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. పంట దిగుబడికి కీలమైన సెప్టెంబర్ మాసంలో వర్షం జాడ లేకపోవటంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండుముఖం పడ్డాయి.

ప్రజాశక్తి - చిలమత్తూరు

చిలమత్తూరు మండలంలో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో ఆశాజనకంగా వర్షాలు రావడంతో రైతులు ఎక్కువ శాతం మొక్క జొన్న, వేరుశనగ సాగు చేశారు. దీంతో రైతు భరోసా కేంద్రాల వద్ద ఎరువుల కోసం రైతులు పెద్ద ఎత్తున బారులు తీరడం చూశాం. ఎరువులు మందులు అంటూ వేలాది రూపాయలు ఖర్చు చేశారు. ఈ ప్రాంతంలో మొక్కజొన్న మొలక దశలోనే కత్తెర పురుగు ప్రభావం అధికం కావడంతో రైతుకు సాధారణం కంటే అధికంగా ఖర్చులు వచ్చాయి. మూడు నెలలుగా ఆశాజనకంగా ఉన్న పంటలు వర్షాభావం కారణంగా ఒక్క సారిగా ఎండుముఖం పడ్డాయి. ప్రస్తుతం మొక్క జొన్న కంకె దశలో, వేరుశనగ కాయ దశలో ఉంది. కీలకమైన ఈ సమయంలో వర్షం కురవక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడింది. మండల వ్యాప్తంగా సుమారు 6640 ఎకరాలలో మొక్క జొన్న పంటను రైతులు సాగు చేశారు. ఇక వేరుశనగ పంట 2640 ఎకరాలు, కంది 660 ఎకరాలు, మిగిలిన చిరు పంటలతో కలుపుకుని మండల వ్యాప్తంగా దాదాపు 12100 ఎకరాల వరకు రైతులు పంటసాగు చేశారు. కీలమైన సెప్టెంబర్ మాసంలో వర్షం కురవక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోనున్నారు.



ఎండిపోయిన మొక్కజొన్న కంకి

వర్షం పరిస్థితి ఇలా...!

పంటలు బాగా చేతికి రావాలంటే వ్యవసాయశాఖ అంచనాల మేరకు జూన్, జులై, ఆగష్టు,సెప్టెంబర్ నెలల్లో 252 మిల్లీమీటర్ల వర్షం అవసరం. అయితే ఈ నాలుగు నెలల్లో కురిసిన వర్షపాతం 461 మిల్లి మీటర్లు. అంటే అధికారుల లెక్కల ప్రకారం కురవాల్సిన వర్షం కన్నా 209 మిల్లీ మీటర్లు అధికంగా కురిసింది.ఈ లెక్కన పంటలు బాగా పండాలి. అయితే మండలంలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ప్రభుత్వం నాలుగు నెలల వర్షపాతాన్ని సగటున తీసుకుంటోంది. అయితే నెలల వారిగా తీసుకుంటే పరిస్థితి మరోలా ఉంది. జూన్ లో కురవాల్సిన వర్షం 56 మిల్లీమీటర్లు కాగా కురిసింది 157 మిల్లీమీటర్లు. జులై లో కురవాల్సింది 63 మిల్లీమీటర్లు కాగా కురిసింది 58.5 మిల్లీమీటర్లు ఆగస్టు మాసంలో కురవాల్సిన వర్షం 76 మిల్లీమీటర్లు అయితే కురిసింది 224 మిలీమీటర్లు. ఈ మూడు నెలలు మొక్క పెరిగే దశ కాబట్టి పంటలు ఏపుగా పెరిగాయి. ఇక సెప్టెంబర్ నెలకు వస్తే ఇప్పటి వరకు కేవలం 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయింది. అయితే అధికారుల లెక్కల ప్రకారం ఈ మాసంలో 57 మిల్లీ మీటర్ల వర్షపాతం అవసరం. ఈ నెల మొక్క జొన్నకు కంకి దశ, వేరుశనగకి బుడ్డ నుండి కాయ ఊరే దశ. ఈనెలలు అత్యల్పంగా వర్షం కురవడంతో పూర్తి స్థాయిలో పంటలు దెబ్బ తిన్నాయి. రానున్న 15 రోజులలో వర్షం కురిసినా కంది, అనుమ, రాగి వంటి పంటలు మినహా మిగిలిన పంటలు ఆశించిన స్థాయిలో చేతికి అందని పరిస్థితి నెలకొంది. దీంతో రైతులు పరిస్థితి దయనీయంగా మారనుంది. ప్రభుత్వం 4 నెలలను సగటుగా తీసుకోకుండా నెలల వారిగా తీసుకొంటే రైతులకు ప్రభుత్వం నుండి పంట నష్టపరిహారం అందే అవకాశం ఉంటుంది.

పెట్టుబడి కూడా చేతికి అందదు



నేను 2 ఎకరాలలో మొక్క జొన్న సాగుచేశాను. ఖర్చు తక్కువగా వస్తుందనుకున్నాను. తక్కువన్నా నాకు రెండు ఎకరాలకు ఇప్పటి వరుకు సుమారు రూ.60 వేల వరకు ఖర్చు వచ్చింది. ప్రస్తుతం పశువుల మేతకు మాత్రమే పంట పనికి వస్తుంది. పంటను కోసి భద్రపరుచుకోవాలన్నా మరలా కూలీ రేటు ఖర్చు వస్తుంది, ఏమి మిగిలే పరిస్థితి లేదు. పెట్టుబడి కూడా చేతికి అందదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

వేణుగోపాల్ రెడ్డి,
రైతు, కమ్మయ్యగారిపల్లి

కీలక దశలో వర్షాభావం

సెప్టెంబర్ మాసంలో వర్షం కురవడం కీలకం. ఎందుకంటే పంటకు ఇది కీలకమైన దశ. మొక్క జొన్న కంకి,వేరుశనగ కాయ పెరిగే దశ. అయితే సెప్టెంబర్‌లో ఇప్పటివరుకు 1.3 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదయింది. రాబోయే 15 రోజులలో కనీసం 55 మిల్లీమీటర్ల వర్షం నమోదయితే రైతులకు కొద్ది వరకు మేలు జరగవచ్చు.

వంశీకృష్ణ
మండల వ్యవసాయ శాఖ అధికారి



ఎండుముఖం పట్టిన వేరుశనగ పైరు

కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు

ప్రజాశక్తి - బ్రహ్మసముద్రం

శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించేదాకా నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు తేల్చిచెప్పారు. తమ సమస్యల పరిష్కారం కోసం తాగునీటి పథకం కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా ఓబులు సోమవారం నిరవధిక సమ్మెలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అంతకు మునుపు సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. అనంతరం నిరవధిక సమ్మెలో భాగంగా కార్మికులతో కలసి నల్లగుడ్డలు నోటికి కట్టుకుని మౌన ప్రదర్శన చేశారు. అనంతరం ఓబులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని వెనకడుగు వేసే ప్రసక్తే లేదని అన్నారు. తాగునీటి పథక కార్మికుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోందని విమర్శించారు. బకాయి వేతనాలను తక్షణ మంజూరు చేయాలని అలాగే క్యూవ్, క్యూ సి లను యుద్ధ ప్రాతిపదికను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఒక పక్క గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని మరో పక్క కుటుంబపోషణ కరువై కార్మికులు రోడ్లెక్కి దీక్షలు చేస్తున్నారని అన్నారు. వీటికి ప్రధాన కారణం అధికారుల నిర్లక్ష్యమేనని అన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అనంతపురం బైపాస్ నుండి ఎస్ఈ కార్యాలయం వరకు, అక్కడి నుండి కలెక్టరేట్ కార్యాలయానికి బైక్ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెకు బ్రహ్మసముద్రం మండల అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ సెక్టార్ లీడర్ పొబ్బర్లపల్లి సుజాత తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, శ్రీరామ్ రెడ్డి తాగునీటి పథకం కార్మికుల జిల్లా ట్రెజరర్ వన్నూరుస్వామి, కార్మికులు తిప్పేస్వామి, గోవిందు, తిప్పేస్వామి, లింగమయ్య, ఎర్రిస్వామినాయక్, రవి తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : తాగునీటి పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పాలకులు, అధికారులు విఫలమయ్యారని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకం కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షులు జి. ఓబులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కళ్యాణదుర్గం తహశీల్దారు కార్యాలయం ఎదుట శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె మంగళవారానికి 12వ రోజుకు చేరుకుంది. మంగళవారం చేపట్టిన సమ్మెకు మద్దతు పలికిన ఓబులు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో వందలాది గ్రామాలకు తాగునీరు అందిస్తున్న శ్రీరామిరెడ్డి, సత్యసాయి తాగునీటి పథకాలకు ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. ఉమ్మడి జిల్లాకు ఏడాదికి రూ. 100కోట్లు కూడా ఇవ్వలేని పరిస్థితితో ప్రభుత్వం ఉందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం స్పందించి తక్షణమే నిధులు మంజూరు చేసి కార్మికుల సమ్మె విరమింపజేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించేదాకా సమ్మె కొనసాగిస్తామని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మంగళవారం అనంతపురం కలెక్టర్ కార్యాలయం వరకు నిర్వహించే బైక్‌ర్యాలీలో అధికసంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో సిఐటియూ జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్ ప్రసాద్, అంగనవాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల, సిఐటియు నాయకులు వన్నూరుస్వామి, వన్నురప్ప, నరేష్, భవిత్, తులసి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.



కళ్యాణదుర్గంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

అప్పులబాధతో యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి గుంతకల్లు రూరల్



మృతుడు రాజశేఖర్

గుంతకల్లు మండల పరిధిలోని చింతలంపల్లి గ్రామానికి చెందిన యువరైతు అప్పుల బాధతో ఆదివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనకు సంబందించి బాధితులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు... చింతలంపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్(34) అనే రైతు తనకున్న నాలుగు ఎకరాల పొలంలో మిరప పంటను ప్రతి ఏడాది సాగు చేస్తున్నాడు. అయితే మూడు సంవత్సరాలుగా మిరప పంట దిగుబడి రాలేదు. దీంతో అప్పులపాలయ్యాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది తన నాలుగు ఎకరాల పొలంతో పాటు అదే గ్రామంలోని ఓ రైతుకు చెందిన 20 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వేరుశనగ పంట సాగు చేశాడు. పంట చేతికొచ్చిన సమయంలో ఎడతెరిపి లేని వర్షాలతో పంట మొత్తం పూర్తిగా నష్టపోయాడు. గత మూడు సంవత్సరాలుగా పంట నష్టపోవటంతో పాటు ఈ ఏడాది కూడా చేతికొచ్చిన పంట నోటికి అందకకుండా పోయింది. మూడేళ్లుగా పంటసాగుకు, కుటుంబపోషణకు దాదాపు రూ. 20 లక్షల దాకా అప్పు చేశాడు. కేవలం ఈ ఏడాది వేరుశనగ సాగు చేసి నష్టపోవటంతో రూ.9 లక్షల వరకు అప్పు అయింది. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న మనోవేదనకు రాజశేఖర్ గురయ్యాడు. అదే సమయంలో అప్పు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి మొదలైంది. గ్రామంలో తలవంపులు తెచ్చుకుని అవమాన భారం మోయలేక ఊర చివర ఉన్న తన పొలం వద్దకు ఆదివారం రాత్రి వెళ్లిన రాజశేఖర్ తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. రాజశేఖర్ ఎంతసేపటికి ఇంటికి రాకపోవటంతో రాకపోవడంతో అతడి మేనమామ పొలం వద్దకు వెళ్లి చూడగా రాజశేఖర్ అపస్మారక స్థితిలో కన్పించాడు. దీంతో కుటుంబసభ్యులకు సమాచారమిచ్చి హుటాహుటిన గుంతకల్లు లోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూరాజశేఖర్‌మృతిచెందాడు.మృతునికి భార్య జ్యోతితో పాటు 9వ తరగతి చదువుతున్న కూతురు, ఆరు సంవత్సరాల బాలుడు ఉన్నారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

18న మూడు అన్నక్యాంటీన్లు ప్రారంభం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



నగరంలో ముస్తాబైన అన్న క్యాంటీన్

ఈనెల 18వ తేదీన నగరంలో మూడు అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని పాతూరులోని గుత్తి రోడ్డు, రైల్వేస్టేషన్ వద్ద, బళ్లారి బైపాస్‌ల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా క్యాంటీన్ల వద్ద పనులు పూర్తయ్యాయన్నారు. పట్టణ ప్రాంతంలో ఉన్న ప్రతి పేదవాడికీ ఆకలి తీర్చడమే అన్నక్యాంటీన్ ఉద్దేశమన్నారు. ప్రస్తుతం మూడు మాత్రమే ప్రారంభిస్తున్నామని, రానున్న రోజుల్లో అవసరమైతే మరికొన్నిచోట్ల క్యాంటీన్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సీతారాం ఏచూరి ఆశయాలు కొనసాగిద్దాం

ప్రజాశక్తి-ఉరవకొండ

కామ్రేడ్ సీతారాం ఏచూరి ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప పిలుపునిచ్చారు. సోమవారం ఉరవకొండలోని కవిత హోటల్ ఎదురుగా సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ఇందులో భాగంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తులు మాట్లాడుతూ ఏచూరి విద్యార్థి దశ నుంచి సేవాభావాలతో పని చేశారన్నారు. ఆయన జీవితకాలం దేశ, ప్రజా శ్రేయస్సు, కార్మిక, కర్షక, ప్రజల బాగోగుల కోసం పని చేశారన్నారు. రాజ్యసభ సభ్యుడిగా అనేక చట్టాలు తీసుకురావడానికి కృషి చేశారన్నారు. ఆయన మృతి పార్టీతోపాటు ప్రజలందరికీ తీరని లోటన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మధుసూదన్, జిల్లా కమిటీ సభ్యులు రంగారెడ్డి, కృష్ణమూర్తి, రైతుసంఘం జిల్లా నాయకులు జ్ఞానమూర్తి, సీనప్ప, వీరాంజనేయులు, మురళి, రవికుమార్, వెంకటేశులు, రామాంజనేయులు నాయక్, వజ్రకరూరు మండల కన్వీనర్ విరూపాక్షి, ఉరవకొండ ఎంపిపి నరసింహులు, మాజీ జడ్పిటిసి తిప్పయ్య, టీచర్ ఎర్రిస్వామి, సాదిక్, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప

గుంతకల్లు : పట్టణంలోని బిటి పక్కీరప్ప భవనంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. ఇందులో భాగంగా సిపిఐ జిల్లా నాయకులు బి.గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి తదితరులు, ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి అంజళి ఘటించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ కార్యదర్శి గోపీనాథ్, సహాయ కార్యదర్శి ఎస్ఎండి.గౌస్, రాష్ట్ర సమితి సభ్యులు మురళీకృష్ణ, పట్టణ కమిటీ సభ్యులు సురేష్, ఈశ్వరయ్య, కుళ్లాయప్ప, చిదంబరం, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.



గుంతకల్లులో ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు




ఉరవకొండలో ఏచూరికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గార్మెంట్ పరిశ్రమ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే కాలవ

ప్రజాశక్తి-రాయదుర్గం

వ్యవసాయం తర్వాత ఎక్కువ మందికి ఉపాధికి కల్పించే గార్మెంట్ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తరపున చేయూత అందిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. సోమవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన రాయదుర్గం రెడీమేడ్ గార్మెంట్స్ మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షులు టంకశాల హనుమంతు మాట్లాడుతూ రాయదుర్గం ప్రాంతంలో వేలాదిమంది కార్మికులు గార్మెంట్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. పరిశ్రమలో నెలకొన్న ఒడిదుడుకుల కారణంగా పరిశ్రమ తన పూర్వవైభవాన్ని కోల్పోయే పరిస్థితికి వచ్చిందన్నారు. టెక్స్‌టైల్ పార్కులో ప్రారంభం కాని ప్లాట్లలో పరిశ్రమకు సంబంధించిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లు కేటాయించాలని కోరారు. షాపింగ్ మాల్స్, ఆన్‌లైన్ వ్యాపారాల వల్ల రాయదుర్గంలో గార్మెంట్ పరిశ్రమలో వ్యాపారాలు బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. అంతేకాక చైతన్య, నారాయణ మొదలైన విద్యాసంస్థలు తమ యూనిఫారం (ఏకరూప దుస్తులు) తయారు చేసేందుకు నేరుగా రాయదుర్గంలోని ఉత్పత్తిదారులకే తమ ఆర్డర్లు ఇచ్చేలా ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తాను ఎంపీగా ఉన్నప్పుడు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 20 ఏళ్ల క్రితం రాయదుర్గం, పామిడిలలో టెక్స్‌టైల్ పార్కు మంజూరు చేయించినట్లు గుర్తు చేశారు. పదేళ్ల తర్వాత తాను రాయదుర్గం ఎమ్మెల్యేగా ఎన్నికైతే అప్పటి వరకు టెక్స్‌టైల్ పార్కులో ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. ఎమ్మెల్యేగా తాను కలెక్టర్, బ్యాంకర్లు గార్మెంట్ ఉత్పత్తిదారులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన అనుమతులు 40 అడుగుల రోడ్డు మొదలైన వాటిని చేయించడంతో ఉత్పత్తిదారులు పరిశ్రమలు ఏర్పాటుకు ముందుకు రాగా ఆరు యూనిట్లకు తాము భూమిపూజ, 5 యూనిట్లను ప్రారంభించానని వివరించారు. అయితే నేడు కేవలం ఒక్క యూనిట్ మాత్రమే అక్కడ ఉత్పత్తి జరుగుతోందన్నారు. టెక్స్‌టైల్ పార్కుకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు పార్కులో పరిశ్రమతో సంబంధంలేని వారిని తొలగించి ఔత్సాహిక గార్మెంట్ పారిశ్రామికవేత్తలకు వాటిని కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు మురళీకృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, కోశాధికారి వెంకటేశులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్ వి.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

ఘనంగా మిలాద్ ఉన్ నబి వేడుకలు

ప్రజాశక్తి-రాయదుర్గం

పట్టణంలో మిలాద్ ఉన్ నబి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని బళ్లారి రోడ్డు గౌస్ ఏ అజం మసీదు నుంచి పట్టణ ప్రధాన వీధుల మీదుగా దర్గా మసీదు వరకూ మిలాద్ ఉన్ నబి (జూలూస్) ఊరేగింపు కొనసాగింది. ఊరేగింపులో మక్కా మదీనా నమూనాలు, మహమ్మద్ ప్రవక్త కేశాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఖాజీ మహమ్మద్ సైపుల్లా, కర్ణాటక రాష్ట్రానికి చెందిన అబ్దుల్ ఖదీర్ రస్వీ, దర్గా మసీదు కమిటీ సభ్యులు చమ్మ అస్లాం, అబూబకర్, హమీద్, ఫక్రుద్దీన్, మత గురువులు మౌలానా అహ్మద్, ముజాహిద్ రజా, మజ్లిస్ పార్టీ రాయదుర్గం అధ్యక్షులు బ్రెడ్ శర్మాస్, మాజీ అధ్యక్షులు, వైసిపి రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంలో మిలాద్ ఉన్ నబీ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం 5 గంటలకు ఫజర్ నమాజ్ అనంతరం స్థానిక జామియా మసీదు నుండి మక్కా, మదీనా నమూనాలను పురవీధుల గుండా ఊరేగించారు. తర్వాత జామియా మసీద్, హజరత్ సికిందర్ హాజీవలి దర్గాల్లో అన్నదానం చేశారు.



కణేకల్లు మండలంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

బొమ్మనహాల్ : మండలంలోని ముస్లిములు సోమవారం మిలాద్ ఉన్ నబి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఉదయం మసీదు వద్ద గంజి, బ్రెడ్లు పంపిణీ చేశారు. కొన్ని మసీదులు వద్ద అన్నదానం చేశారు. సాయంకాలం ఆయా మసీదుల నుంచి మక్కా, మదీనా చిత్రపటాలను టాక్టర్‌పై ఉంచి ఊరేగింపు నిర్వహించారు.

కణేకల్లు : మిలాదున్ నబి వేడుకలను ముస్లిములు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మదీనా మజీద్ నుంచి దివాన్ పీర్ దర్గా వరకూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం దర్గా ఆవరణలో సభ చేసిన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ సాటి మనుషులపై ప్రేమ, సమాజంపై బాధ్యత అని ప్రపంచ శాంతి మహమ్మద్ ప్రవక్త మానవళికి సందేశం ఇచ్చారన్నారు. మతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ ఐక్యమత్యంగా ఒకరికొకరు సహకారంతో కలిసి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ ఫక్రుద్దీన్ సాబ్, బళ్లారి మున్నాభాయ్, గౌస్‌పీర్, ముజ్జు, టైలర్ మహబూబ్‌పీరా, ఎంసీ శర్మాస్, హుస్సేన్ కా నబిరసూల్, మౌలాలి, రహీం, ఖాదర్‌వలి, ఆనంద్‌రాజ్, లాలప్ప, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పట్టణంలో మిలాద్ ఉన్ నబి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా పట్టణంలోని హజ్రత్ సయ్యద్ ఖాదర్‌వలి బాబా మదని (రాహమ్ తుల్లా అలై) దర్గా నుంచి మసీదు వరకూ ఊరేగింపు నిర్వహించారు.

యల్లనూరు : మండలవ్యాపంగా మిలాద్ ఉన్ నబి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఊరేగింపులు నిర్వహంచారు. అనంతరం మతపెద్దలు పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు, పెద్దఎత్తున ముస్మిములు పాల్గొన్నారు.



రాయదుర్గంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిములు

పుట్లూరు : మండల కేంద్రంతోపాటు కోమటికుంట్ల, ఎస్.గూడూరు, తదితర గ్రామాల్లో మిలాద్ ఉన్ నబి వేడుకలను ముస్లిములు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తర్వాత ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలతోపాటు ముస్లిములు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మిలాద్ ఉన్ నబి వేడుకలను పురస్కరించుకుని సోమవారం మండల కేంద్రంలోని సద్దానప్ప దర్గా వద్ద నుంచి ముస్లిములు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ముస్లిం మతపెద్దలు పండుగ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలతోపాటు ముస్లిములు పాల్గొన్నారు.



పామిడిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లిములు

సిఎం సహాయనిధికి గార్మెంట్స్ అసోసియేషన్ విరాళం

రాయదుర్గం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం రాయదుర్గం రెడీమేడ్ గార్మెంట్స్ మ్యానుఫ్యాక్చర్ అసోసియేషన్ రూ.3లక్షల విరాళాన్ని ప్రకటించింది. ఈమేరకు అసోసియేషన్ అధ్యక్షులు టంకశాల హనుమంతు సంబంధిత మొత్తానికి సంబంధించిన డిమాండ్ డ్రాఫ్ట్‌ను ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు సోమవారం అందజేశారు. అంతేకాక రూ.15 లక్షల విలువజేసే 5వేల రెడీమేడ్ గార్మెంట్ ప్యాంట్లను కూడా పంపనున్నట్లు తెలిపారు. అలాగే మరో గార్మెంట్ ఉత్పత్తి ధరల అశోక్ రూ.20వేల చెక్కును ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు కెబి.మురళీకృష్ణ, కార్యదర్శి బిసా శ్రీనివాస్, కోశాధికారి వెంకటేశులు, అసోసియేషన్ సభ్యులు, ఉత్పత్తిదారులు, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న గార్మెంట్స్ అసోసియేషన్ నాయకులు

ఆసుపత్రి ప్రారంభం

అనంతపురం రూరల్ : అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రయివేటు ఆసుపత్రికి వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌తో కలిసి పరిటాల సునీత సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాకు ఒక క్యాన్సర్ ఆసుపత్రి, చిన్నపిల్లల వైద్యం కోసం ఆక్సిజన్‌తో కూడిన అంబులెన్సులు అందివ్వాలని మంత్రి సత్యకుమార్‌కు ఎమ్మెల్యే విన్నవించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, టిడిపి కార్యకర్తలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యే సునీత

సిఐకి సన్మానం

పామిడి : పామిడి సిఐగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన యుగంధర్‌ను జనసేన పార్టీ నాయకులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు కొట్టాల సూర్యనారాయణ, వడ్డే రాము, షేక్షావలి, నక్కల రామాంజనేయులు, సూర్య, సాయి, మాబు, బాషా, జిల్లు, సురేంద్రబాబు, వెంకటేశు, కొట్టాల రామాంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



సిఐను సన్మానిస్తున్న జనసేన నాయకులు

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-గుంతకల్లు

మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని మూడు ప్రాంతాల్లో రెడ్‌డ్రాప్ బ్లడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహి ంచిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. మునిసిపల్ కార్యాలయం, హజరత్ మస్తాన్‌వలి దర్గా, టిబి.రోడ్డు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన శిబిరాలను అబ్దుల్ రజాక్‌పీర్ సాహబ్ గవర్నమెంట్ ఖాజీ, మౌలానా ముఫ్తీ మన్సూర్ అలీ సాహబ్ ప్రారంభించారు. ఈ శిబిరాల్లో 160 మంది రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని గవర్నమెంట్ బ్లడ్‌బ్యాంక్, స్థానిక గోపీ బ్లడ్‌బ్యాంకుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌డ్రాప్ ఫౌండర్ రెహమాన్, ప్రెసిడెంట్ గులాబ్ మహమ్మద్, ప్రధాన కార్యదర్శి షఫీ, వైస్ ప్రెసిడెంట్ చింతా దివాకర్, భగత్‌సింగ్ బ్లడ్ డోనర్స్ ఫౌండర్ నాగరాజు, షబ్బీర్, ప్రాణదాత బ్లడ్ డోనర్స్ తిప్పన్న, హనుమంతు, పరశురాముడు, లెజెండ్ బ్లడ్ ఆర్గనైజేషన్ రంజాన్, కారుణ్య హెల్పింగ్ హాండ్స్ ఫౌండర్ కాకుమాను బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులతో ముస్లిం మతపెద్దలు

అపుస్మా జిల్లా అధ్యక్షులుగా కె.సుబ్బారెడ్డి

కార్యదర్శిగా ఎస్.రవిశంకర్ ప్రసాద్

ప్రజాశక్తి -అనంతపురం

జిల్లా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్య సంఘం నూతన జిల్లా అధ్యక్షులుగా కె.సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శిగా ఎస్.రవిశంకర్ ప్రసాద్, కోశాధికారిగా బివి.శ్రీనాథ్‌ను ఎన్నుకున్నారు. స్థానిక మాంటిస్సోరి ఎలైట్ స్కూల్ జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి 350 నుంచి 400 మంది సభ్యులు హాజరయ్యారు. అబ్జర్వర్‌గా కర్నూలు నుంచి శ్రీనివాస్‌రెడ్డి, కర్నూలు ప్రెసిడెంట్ వాసు దేవయ్య హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో మాజీ అధ్యక్ష, కార్యదర్శులు కుసుమ పుల్లారెడ్డి, గాజులు చంద్ర, నాయుడు, రాష్ట్ర నాయకులు నాగరాజు, శశిభూషణ్, కరస్పాడెంట్లు రఘునాథరావు, జలీల్, అన్వర్, నారాయణారెడ్డి, మధుసూదనరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా అధ్యక్షులు కె. సుబ్బారెడ్డి | కార్యదర్శి ఎస్. రవిశంకర్ ప్రసాద్ | కోశాధికారి బివి.శ్రీనాథ్

యుటిఎఫ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-ఉరవకొండ

పట్టణంలోని గవిమఠం వెనుక నిర్మించనున్న యుటిఎఫ్ ప్రాంతీయ కార్యాలయ సొంత భవన నిర్మాణానికి యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, సహాధ్యక్షులు రామప్పచౌదరి, జిల్లా కార్యదర్శి సంజీవకుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో తాలూకా స్థాయిలో యుటిఎఫ్ సొంతభవనం ఏర్పాటు చేసుకోవడం శుభ పరిణామం అన్నారు. పదేళ్లగా యుటిఎఫ్ ఉద్యమ అవసరాలు, ఉపాధ్యాయుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. యుటిఎఫ్ ఏర్పాటై 50ఏళ్లు పూర్తయిన సందర్భంగా డిసెంబర్ 14, 15, 16, 17వతేదీల్లో స్వర్ణోత్సవ మహాసభలు కాకినాడలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.శ్రీనివాసులు, ఉమాపతి, విడపనకల్లు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.లక్ష్మీనారాయణ, కె.రఘు, వజ్రకరూరు అధ్యక్ష ప్రధాన, కార్యదర్శులు జి.పవన్, మురళి, పి.జయరాములు, మండల కార్యదర్శి ఇస్లాంబాషా, ప్రాంతీయ కార్యాలయ కార్యదర్శి బండయ్య, నాయకులు సి.నాగరాజు, శ్రీధర్, కె.శ్రీనివాస్‌గుప్తా, మైలార్ లింగ, శ్రీధర్, జి.గిరి, రాజశేఖర్, చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

పెద్దాసుపత్రి వద్ద అన్నదానం

అనంతపురం : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు 'పుట్టినిల్లు' ఆశ్రమం ఆధ్వర్యంలో సోమవారం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ ట్రస్టు సభ్యులు హాజీ మెహరునీసా జయంతి సందర్భంగా భర్త నబిరసూల్, వారి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు రిజ్వానా, సుబ్రమణ్యం, ఓబుళపతి, కిష్టప్ప, రవికుమార్, మణిదీప్, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న నిత్యసురభి ట్రస్టు సభ్యులు

మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు నిర్వహించాలి

ప్రజాశక్తి-అనంతపురం

పులివెందుల, ఆదోని మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లు నిర్వాహించేందుకు చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు వెన్నపూస రవీంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పులివెందుల మెడికల్ కళాశాలను ఒక్కసారి కూడా పరిశీలించకపోవడం బాధాకరమన్నారు.

స్వయానా ఎమెల్సీ భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి ఇంటికి సమీపంలోనే ఉన్నా ఒక్కసారి కూడా వెళ్లకపోవడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టబద్రుల ఓట్లతో గెలుపొందిన ఆయన వారిని పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్సీతోపాటు ప్రభుత్వం మెడికల్ కళాశాలపై దృష్టి సారించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.



విలేకరులతో మాట్లాడుతున్న వెన్నపూస రవీంద్రారెడ్డి

జెఎన్‌టియు మాజీ ప్రొఫెసర్ సౌందర్‌రాజన్ మృతి

అనంతపురం : స్థానిక జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగం మాజీ ప్రొఫెసర్ సౌందర్‌రాజన్ సోమవారం మధ్యాహ్నం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జెఎన్‌టియు ఇన్‌ఛార్జి విసి హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, వర్సిటీ డైరెక్టర్లు భానుమూర్తి, వైశాలి ఘోర్పాడే, సుజాత, సత్యనారాయణ, జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు టి.నారాయణరెడ్డి, కార్యదర్శి శారద, అసోషియేట్ ప్రెసిడెంట్ ఎపి.శివకుమార్, సభ్యులు సి.శశిధర్, మమత, అజిత, తదితరులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

తుంగభద్ర జలాశయం గేట్లను మార్చాలి

ప్రజాశక్తి-ఉరవకొండ

శిథిలావస్థకు చేరుకున్న తుంగభద్ర జలాశయం గేట్లన్నింటినీ మార్చాలని సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండ్ చేశారు. సోమవారం ఉరవకొండలోని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తుంగభద్ర డ్యామ్ గేట్లను మార్చాలని కేంద్ర జలసంఘం మాజీ ఛైర్మన్ ఎకె బజాజ్ నేతృత్వంలోని కమిటీ స్పష్టం చేసిన విషయం తెలిసందే అన్నారు. ఇప్పటికే 19వ గేటు కొట్టుకుపోయిందన్నారు. డ్యాం భద్రత దృష్ట్యా 33 గేట్లను మార్చి వాటి స్థానంలో కొత్త గేట్లను అమర్చాలని డిమాండ్ చేశారు. అలాగే హెచ్చెల్సీ వెడల్పు పెంచి లైనింగ్ వేయాలని, కాలువ సామర్థ్యాన్ని 6300 క్యూసెక్కులకు పెంచి 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రజలకు తాగునీరు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఆయా సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈనెల 19న అనంతపురంలో జరిగే సాగునీటి సలహా మండలి సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ నాయకులు మల్లికార్జున, సుల్తాన్, నారాయణమ్మ, గన్నే మల్లేష్, తిప్పయ్య, సంతోష్‌కుమార్, రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతుల కోసం ఉద్యమిస్తాం : ఎపిటిఎఫ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయులకు నెలవారి ఉద్యోగోన్నతుల కోసం ఉద్యమిస్తామని ఎపిటిఎఫ్ రాష్ట్ర పూర్వపు కార్యదర్శి బి.నర్సింహులు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాయల వెంకటేష్, ఎస్‌సి.రాజుద్దీన్ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఎపిటిఎఫ్ జోనల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రెండేళ్లుగా నెలవారీ పదోన్నతులు ఇవ్వనందున వేలాదిగా ఖాళీలు ఉండిపోయాయన్నారు. ఇందుకు పరిష్కారంగా ఉపాధ్యాయులను పని సర్దుబాటు పేరుతో ఎలాంటి ఆర్థిక సౌలభ్యం లేకుండా పని ఒత్తిడిని పెంచుతున్నారన్నారు. ఫలితంగా అనేకమంది ఉపాధ్యాయులు, ముఖ్యంగా మహిళ ఉపాధ్యాయులు మానసిక ఆందోళనలకు గురవుతున్నారన్నారు. పని సర్దుబాటు కూడా 8 కిలోమీటర్లలోగా ఉండాలని స్పష్టంగా ఉన్నప్పటికీ డివిజన్ పేరుతో దూర ప్రాంతాలకు ఉత్తర్వులు ఇవ్వడం సమంజసం కాదన్నారు. కావున వెంటనే ప్రభుత్వం నెలవారి పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే పిఎఫ్ లోన్లు, పార్ట్ ఫైనల్‌లు, ఎపిజెఎల్ఐ సెటిల్మెంట్లు తక్షణమే చెల్లించాలన్నారు. జీవో 117 ని రద్దు చేసి విద్యారంగంలోని అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారు బి.వెంకటేశులు, రాష్ట్ర కౌన్సిలర్ జివి.రమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సర్దార్‌వలి, జిల్లా ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, జిల్లా నాయకులు చిదంబరరెడ్డి, మహేష్, ఓబులేసు, ఆంజనేయులు, రాప్తాడు ఓబులేసు, హిమగిరి ప్రసాద్, అడవిరాజు, గురుమూర్తి, అక్కులన్న, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

అన్నదానం

పుట్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం చేశారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, కుందు శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు

పుట్లూరు : మిలాన్ ఉద్ నబి పండుగ సందర్భంగా నియోజకవర్గ ముస్లిములకు ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గానికి చెందిన పలువురు ముస్లిములు అనంతపురంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతిపూర్వక మానవ సమాజాన్ని నెలకొల్పేందుకు మహమ్మద్ ప్రవక్త తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. అలాంటి ప్రవక్త జన్మదినాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అంతేగాకుండా రాష్ట్రంలో ముస్లిములకు ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మతపెద్దలు ఆఫీస్‌సాబ్, మహబూబ్‌బాషా, మౌలానా ఇస్మాయిల్, హఫీజు ఖలీల్, టిడిపి జిల్లా నాయకులు బాబా ఫక్రుద్దీన్‌వలి, ఎంఎస్‌పి సీనియర్ నాయకులు కరెంటు పీరా, టిడిపి మైనార్టీ నాయకులు పూల బాబా ఫక్రుద్దీన్, గఫూర్, అంచల ఖాసీంవలి, నూరుమహమ్మద్, జాఫర్‌ఖాన్, చాపల మాబు, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు బొకే అందజేస్తున్న ముస్లిములు

అంతిమ సంస్కారాలకు ఆర్థికసాయం

గుత్తి : అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని బసినేపల్లి తండాకు చెందిన జనసేన కార్యకర్త రమావత్ వెంకటేష్‌నాయక్ (35) కుటుంబానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ సోమవారం ఆర్థికసాయం అందజేశారు. ముందుగా గ్రామానికి చేరుకుని మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి దహన సంస్కారాల కోసం రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, నాయకులు చెరుకూరి లక్ష్మణ్ చౌదరి పాల్గొన్నారు. అలాగే జనసేన నియోజకవర్గ బాధ్యుడు వాసగిరి మణికంఠ, నాయకులు పాటిల్ సురేష్, చిన్న వెంకటేశులు, గోరంట్ల నాగయ్య లు జనసేన కార్యకర్త వెంకటేష్ నాయక్ మతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.



నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని మండలం గజరాంపల్లి గ్రామ సమీపంలో ఉన్న వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమలో సోమవారం వినాయక నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గజరాంపల్లి నుంచి పొగరూరు వరకూ వాలి గ్రీన్ గార్మెంట్ ఉద్యోగులు, యువత, మహిళలు పెద్దఎత్తున నృత్యాలు చేసుకుంటూ ఊరేగింగా వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పెరుమాళ్ల జీవానంద రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతోనే వ్యాలీ గ్రీన్ గార్మెంట్ పరిశ్రమను ఏర్పాటు చేశామన్నారు. ఇందులో భాగంగా ప్రతి కుటుంబం ఆనందంగా ఉండాలని భావించి 9రోజులపాటు వినాయక ప్రతిమను ప్రతిష్టించి పూజలు చేసినట్లు తెలిపారు.

'ఉపాధి' సామాజిక తనిఖీ ప్రజా వేదిక

బెలుగుప్ప : మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులపై ఎంపిపిపి పెద్దన్న అధ్యక్షతన సోమవారం ప్రజావేదిక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గ్రామ పంచాయతీల రికార్డులను పరిశీలించారు. మండలంలోని 19 పంచాయతీల్లో ఉపాధి నిధులతో చేపట్టిన పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల్లో 1122 పనులకు రూ.7.38 కోట్ల ఖర్చు చేశారు. ఈ సందర్భంగా ఆయా పనులను చదివి వినిపించారు. ఇందులో మండల వ్యాప్తంగా రూ.17,33,358 రికవరీకి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డ్వామా ఎపిడి సుధాకర్‌రెడ్డి, ఎంపిడిఒ రామచంద్ర, ఎస్‌ఆర్‌పి లక్ష్మీనారాయణ, పిఆర్ ఎఇ సుధాకర్, హౌసింగ్ ఇఎ శివారెడ్డి, సర్పంచి సాలిబాయి, వైస్ ఎంపిపి పుష్పావతి, టిడిపి నాయకులు కన్వీనర్ ప్రసాద్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, ఉపాధ్యక్షులు పెద్ద తిప్పయ్య, ఈశ్వరప్ప, బిజెపి మండల కన్వీనర్ వన్నూరుస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్వచ్ఛతా' కార్యక్రమం

పుట్లూరు : మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ యోగానందరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అధికారులు, సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితోపాటు గ్రామస్తులతో కలిసి గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి స్వచ్ఛతపై అవగాహన కల్పించాలన్నారు.

గార్లదిన్నె : కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం నుంచి మండలవ్యాప్తంగా స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ విజయభాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరవుతారన్నారు.

ఈక్రాప్ బుకింగ్ చేయించుకోండి

గార్లదిన్నె : పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఇప్పటి వరకూ 7,384 రైతులు 28,000 ఎకరాలకు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్నారన్నారు. మిగిలిన రైతులు కూడా చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వం పథకాలకు అర్హులు కారన్నారు.

టిడిపి గుత్తి అధ్యక్షుడు ఎంకె.చౌదరికి సన్మానం

ప్రజాశక్తి-గుత్తి

టిడిపి గుత్తి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరిని ప్రజాప్రతినిధులు, నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఇందులో భాగంగా సర్పంచి పి.భరత్ కుమార్, మాజీ ఎంపిటిసి ఎ.నరసింహులుతోపాటు పలువురు నాయకులు చౌదరి నివాసానికి వెళ్లి శాలువా, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కృష్ణారావు, నారాయణస్వామి, హెచ్ఎం ఆసీఫ్, హెచ్ఎం.మహమ్మద్‌అర్షద్, ఆరీఫ్, న్యాయవాది సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఎంకె.చౌదరిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

నేరాలు ఘోరాలు

వంకలో పడి వ్యక్తి మృతి

పామిడి : మద్యం మత్తులో బ్రిడ్జిపై నుంచి వంకలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన సోమవారం పట్టణ పరిధిలో వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే... మూడు రోజుల క్రితం ఎద్దులపల్లికి చెందిన రామదాసు (60) మద్యం మత్తులో సమీపంలోని బ్రిడ్జి పై నుంచి వంకలో పడిపోయాడు. వంకలో ఎక్కువ లోతు ఉండటంతో ఎంత వెతికినా కనిపించలేదు. మూడు రోజుల క్రితం వెళ్లిన రామదాసు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు వెతకడం ప్రారంభించారు. ఈనేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నీటి గుంతలో నుండి శవమై కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పామిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



మృతిచెందిన రామదాసు